క్లుప్తంగా

రణస్థలం చేరుకున్న పైడితల్లి ప్రచార రథం


రణస్థలంలో పైడితల్లి అమ్మవారి ప్రచార రథం

రణస్థలం: విజయనగరం జిల్లా కేంద్రంలోని పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవ సంబరాలు సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు జరుగుతాయని అమ్మవారి దీక్షపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో తెలిపారు. పైడితల్లి సిరిమానోత్సవ ప్రచార రథం సోమవారం రణస్థలం చేరుకుంది. పైడితల్లి సిరిమానోత్సవ ప్రచార పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సూర్యపాత్రో మాట్లాడుతూ సెప్టెంబర్ 20 నుంచి మండల దీక్ష కార్యక్రమాలతో సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. అదేరోజు వనం గుడి వద్ద పందిరి రాట, అక్టోబర్ 14 తేదీన తోలేళ్ల ఉత్సవం , 15న సిరిమానోత్సవం, 22న తెప్పోత్సవం, 27న కలశ జ్యోతి ఊరేగింపు, 29న అమ్మవారి ఉయ్యాల ఉత్సవం, 30న చండీహోమం, దీక్షా విరమణ, పూర్ణాహుతితో సిరిమాను ఉత్సవాలు ముగిస్తాయన్నారు.

శ్రీకూర్మనాథున్ని దర్శించుకున్న జిల్లా కలెక్టర్


శ్రీకూర్మనాథుని సన్నిధిలో కలెక్టర్ కుటుంబసభ్యులు

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మనాథున్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సతీసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆయనతో పాటు తల్లిదండ్రులు విచ్చేసి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీదేవి దర్శనం తర్వాత శిల్ప సంపద, ఆకుపసర చిత్రాలు, తాబేళ్ల పార్కును సందర్శించారు. క్షేత్ర మహాత్యాన్ని ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతా రామనృసింహాచార్యులు తెలియజేశారు.

సమన్వయకర్తల కమిటీ మెంబర్‌గా డాక్టర్ రాజేష్


డాక్టర్ బి.రాజేష్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీఐఐ ఉన్నత విద్యామండలి పరిశ్రమల సమన్వయకర్తల కమిటీ మెంబర్‌గా ఎంపికైనట్లు డాక్టర్ బి.రాజేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఉన్నత విద్యా పరిశ్రమల కాంబినేషన్‌తో విద్య, ఉద్యోగ రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఐతం ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్, ఇండస్ట్రీ రిలేషన్ అధిపతి డాక్టర్ బి.రాజేష్‌ను మెంబర్ గా నియమించింది.

ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం కేంద్రంలో ఉన్న గిరిజాముక్కంటేశ్వర ఆలయంలో బాద్రపద మాస శుద్ధ త్రయోదశి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పెంటా రామారావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు శివుడిని దర్శించుకున్నారు.

ముగిసిన అఖండ భజన


పాల్గొన్న సాయి భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు, వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని పెద్దమందిరంలో నిర్వహిస్తున్న 100 గంటల అఖండ నామ సంకీర్తన సోమవారంతో ముగిసింది. నాలుగు రోజులుగా వివిధ సత్యసాయి మందిరాల నుంచి వచ్చిన సాయి భక్తులు ఆపకుండా రోజంతా విడతల వారీగా భజనలు చేశారు. కార్యక్రమంలో పెద్దమందిరం కన్వీనర్ మురళీకృష్ణ, జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు, రమణబాబు, భజన్స్ ఇన్‌చార్జి వినోద్, కిల్లాన పాల్గుణరావు, మహిళలు పాల్గొన్నారు.

18న మండల క్రీడా పోటీలు

గార: మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నామని ఎంఈవోలు రామకృష్ణ, వినోదినులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్ పోటీల్లో బాలికలకు వమరవల్లి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో, బాలురకు సతివాడ జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతాయన్నారు.


ఊరేగింపుగా నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


జెడ్పీ ఎదురుగా ఏర్పాటు చేసిన అతిపెద్ద వినాయకుని ఊరేగింపు


విజయగణపతి ఆలయం వినాయకుని నాగావళిలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం


జి.సిగడాం: పెంట గ్రామంలో వినాయక విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు


కాళికామాతల వేషధారణలో కళాకారులు

గంగమ్మ చెంతకు గణనాథుడు

- నందడిగా ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథులు గంగమ్మ చెంతకు చేరారు. నగరంలోని పలు చోట్ల గణేష నిమజ్జనోత్సవాలు సోమవారం ఘనంగా సాగాయి. ఈ సందర్భంగా బొజ్జగణపయ్యను మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, నృత్యాలు, వేషధారణల ప్రదర్శనల మధ్య నిమజ్జనానికి తరలించారు. పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయంలో పూజలందుకున్న గణపతి నిమజ్జన ఊరేగింపు ఉత్సాహంగా జరిగింది.

అనంతరం నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గణపతి మాల విసర్జన కార్యక్రమం జరిగింది. ఆలయ ధర్మకర్త ఇప్పిలి హరనాథరావు, అందవరపు సంతోష్ పాల్గొన్నారు. పొన్నాడ బ్రిడ్జి, కోటేశ్వరాలయం వద్ద నాగావళి నదిలో విగ్రహాల నిమజ్జనం జరిగింది.

జి.సిగడాం మండలంలో

జి.సిగడాం: మండల కేంద్రంలోపాటు పలు గ్రామాల్లో వినాయక నవరాత్రులు వైభవంగా ముగిశాయి. సోమవారం అన్నదానం, పలు వినోద కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాలు వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం వినాయ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు.


పీఎన్‌కాలనీలో వరసిద్ధి వినాయకుని ఊరేగింపు


పాండ్రంగి వీధిలో బొజ్జగణపయ్యను ఊరేగిస్తున్న యువకులు


డీజే పాటలకు నృత్యాలు చేస్తున్న యువకులు


విజయగణపతి ఆలయంలో మాలలు వేసిన వారిచే పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


కేరళా సంప్రదాయ వాయిద్యాలు

క్రీడలతో మానసిక ఉల్లాసం

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలు, వ్యాయామంతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని మండల విద్యాశాఖాధికారి కె.పున్నయ్య, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిశోర్‌కుమార్ అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం, ఇండోర్ స్టేడియంలో వివిధ రకాల క్రీడా పోటీలు సోమవారం జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో పున్నయ్య క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం విద్యాబోధనలో తలమునకలై ఉండే ఉపాధ్యాయులకు ఈ పోటీలు నిర్వహణ మంచి ఆటవిడుపు లాంటిదన్నారు. ఉపాధ్యాయులకు మానసిక వికాసంతో పాటు శారీరక శ్రమ కూడా అవసరమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. తమ సంఘం ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా పోటీలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్‌మూర్తి, జిల్లా నాయకులు బి.రవికుమార్, చౌదరి రవీంద్ర, హెచ్.అన్నాజీరావు, పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్, ఎస్.నారాయణరావు పాల్గొన్నారు.


క్రీడా కోర్టును ప్రారంభిస్తున్న ఎంఈవో పున్నయ్య, యూటీఎఫ్ ప్రతినిధులు

చెస్ స్కూల్ కమిటీ వైస్ చైర్మన్‌గా భీమారావు



శ్రీకాకుళం న్యూకాలనీ: చెస్ ఇన్ స్కూల్స్ జాతీయస్థాయి కమిటీ వైస్ చైర్మన్‌గా సనపల భీమారావు నియామకమయ్యారు. ఆలిండియా చెస్ ఫెడరేషన్ వారు ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి చెస్ క్రీడను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన చెస్ ఇన్ స్కూల్స్ కమిటీలో వైస్ చైర్మన్‌గా ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా సేవలు అందిస్తున్న భీమారావును నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఫొటోగ్రాఫర్ల కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

ఎచ్చెర్ల: మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్ల యూనియన్ నూతన కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. యూనియన్ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పిలి వెంకటరమణను అధ్యక్షుడిగా, పి.కొండలరావును ఉపాధ్యక్షుడిగా, ఉప్పాడ దుర్గబాబును కార్యదర్శిగా, పైడి బాలరాజును సహాయ కార్యదర్శిగా, చిరంజీవిని కోశాధికారిగా, గురుపాప దుర్గాకుమార్‌ను సహాయ కోశాధికారిగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

కోతకు గురవుతున్న నదీ తీరం

- ఆందోళనలో అన్నదాతలు
- సమస్య పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి


లావేటిపేటలో కోతకు గురైన నదీతీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో నాగావళి నదీతీరం కోత ప్రధాన సమస్యగా మారింది. రైతుల భూములు ప్రతి ఏటా కోతకు గురవుతున్నాయి. 1990 ఏడాది నుంచి ఈ సమస్య ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 50 ఎకరాల వరకు ఎచ్చెర్ల మండల పరిధిలో కోతకు గురైంది. ప్రధానంగా తమ్మినాయుడుపేట, పొన్నాడ, బొంతలకోడూరు, లావేటిపేట, కాళింగపేట గ్రామాల్లో నాగావళి నదీతీరం కోతకు గురవుతుంది. తుఫాన్‌లు, వరదల సమయంలో ఎక్కువగా కోత ఉంటుంది. కలెక్టర్ నదీతీర ప్రాంతాన్ని ఇటీవల పరిశీలించారు. రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో కమిటీ వేసి, నివేదిక సైతం తెప్పించుకున్నారు. అధికారులు సర్వే సైతం చేశారు. మరోపక్క పొన్నాడ, బొంతలకోడరు గ్రామాలకు చెందిన నాయకులు, రైతులు సమస్యలను స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. గ్రోయిన్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. లేదంటే భవిష్యత్తులో భూములు కోతకు గురికావటం, పల్లపు ప్రాంతాల గ్రామాల్లోకి వరద నీరు చొచ్చుకురావటం వంటి సమస్యలు ఉంటాయని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

గణేశ్ ప్రసాదం లడ్డూ @ రూ.లక్షా వెయ్యి


ఎచ్చెర్ల: లడ్డూను తలపై పెట్టి తీసుకువెళ్తున్న మహేష్ కుటుంబ సభ్యులు


శ్రీకాకుళం కల్చరల్: మహా లడ్డూతో శివ


శ్రీకాకుళం కల్చరల్: అన్నప్రసాదాన్ని వితరణ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని పెద్దకొత్తపల్లి పంచాయతీలో వినాయక చవితి సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రసాదం లడ్డూను వేలం వేశారు. దీన్ని అదే గ్రామానికి చెందిన కాకర్ల మహేష్ లక్షా వెయ్యి రూపాయలకు సొంతం చేసుకున్నారు. లడ్డూను తలపై పెట్టుకుని ఇంటికి తీసుకువెళ్లారు. గ్రామస్తులు, యువత కలిసి గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని సానా వీధిలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం సోమవారం జరిగింది. నాలుగు వేల మందిగి అన్న ప్రసాదాన్ని అందజేశారు. హారికా కన్‌స్ట్రక్షన్ అధినేత కె.ఎన్. ఎస్.వి.ప్రసాద్, సానవీధి యూత్ సభ్యులు ఎల్.యోగేశ్వరరావు, బి.సద్గుణరావు, కె.తవుడు, ఎ.విజయకుమార్, టి.తులసిరావు పాల్గొన్నారు.

రూ. 88 వేలు పలికిన గణపతి లడ్డూ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారులో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రసాదం లడ్డూను సోమవారం వేలం వేశారు. యజ్జాడ శివ 88,888 రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

- రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్: ప్రథమ చికిత్సపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగరంలో ఏడు కళాశాలల యూత్ రెడ్‌క్రాస్ విద్యార్థులు పాల్గొని, విపత్తుల నివారణా చర్యలు, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించుకొని, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాండ్ టీం సభ్యులుగా ఉన్నారని చెప్పారు. విపత్తులు, అత్యవసర చికిత్సలు అందించడానికి వీరు అర్హులని తెలిపారు. ప్రాజెక్టు మేనేజర్ జి.రమణ ప్రథమ, అవసరమైన పరిస్థితిలో చికిత్స ఎలా చేయాలలో డెమో చేసి చూపించారు. లీడింగ్ ఫైర్ ఆఫీసర్ పి.షణ్ముఖరావు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ పురుషులు, మహిళా డిగ్రీ కళాశాల, శివాజీ, వెంకటేశ్వర ఇంజినీరింగ్, గాయత్రి డిగ్రీ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ఎం.కల్యాణచక్రవర్తి, బి.చిన్మయరావు, కె.కల్యాణ్, పి.శ్రీకాంత్, హరి సత్యన్నారాయణ, పెంకి చైతన్య కుమార్, ఎ.నర్సింగరావు, గుణాకరరావు, బి.సతీష్, వలంటీర్లు, పలు స్వచ్ఛందసంస్థల సభ్యులు పాల్గొన్నారు.


ప్రథమ చికిత్సపై డెమో ద్వారా అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రాం మేనేజర్ రమణ

ముస్లింల శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: మహ్మద్ ప్రవక్త సల్లాహూ సల్లాం జయంతి (మిలాద్ ఉన్ నబీ) సందర్భంగా శ్రీకాకుళం పట్టణంలో ముస్లింలు భారీ శాంతి ర్యాలీని సోమవారం నిర్వహించారు. జీటీ రోడ్డులోని జామియా మసీదు వద్ద ప్రారంభమైన ర్యాలీ ఏడురోడ్ల కూడలి, పాలకొండ రోడ్డు, డే అండ్ నైట్ కూడలి, రైతుబజారు, రామలక్ష్మణ కూడలి, సూర్యామహల్ మీదుగా తిరిగి జామియా మసీదు చేరుకుంది. అనంతరం ప్రపంచ శాంతి, మానవాళి శ్రేయస్సు కోసం ప్రార్థనలు జరిగాయి. మతగురువులు మహ్మద్ ప్రవక్త గురించి తెలియజేశారు. ర్యాలీలో జామియా మసీదు అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, ఉపాధ్యక్షులు హాజీ భయ్యా, సెక్రటరీ అక్బర్ బాషా, జాయింట్ సెక్రటరీ షకూర్ ఖాన్, ట్రెజరర్ ఉస్మాన్, గౌరవ అధ్యక్షులు అమీరుల్లా బేగ్, జామియా మసీదు ముఫ్తీ జియావుల్ రెహ్మాన్, జిల్లా ఖాజీ అబ్దుల్ వహాబ్, మాజీ కౌన్సిలర్ ఎంఏ రఫీ, షాను, బహదూర్ బాషా, ఎంఏ బేగ్, అన్ని మసీదుల అధ్యక్షులు, ఇమామ్‌లు పాల్గొన్నారు.

సర్క్యులేషన్ ప్యాట్రన్ సమస్య

పరిష్కరించాలని వినతి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగర పరిధిలో సర్క్యులేషన్ ప్యాట్రన్ సమస్య ఎక్కువగా ఉందని, దీన్ని పరిష్కరించాలని శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు కోరారు. ఈ మేరకు నగర పాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావుకి విన్నవించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఆయనను అసోషియేషన్ ఏపీ అధ్యక్షులు కె.ఎస్.ఎస్.విప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సమస్యను కలెక్టర్‌కు వివరించి పరిష్కారానికి చర్యలు చేపడతానని కమిషనర్ హామీ ఇచ్చినట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. శ్రీకాకుళం సుడా కార్యాలయంలో అనుమతుల కోసం పెట్టిన ప్లాన్లకు టీఎస్ (టౌన్ సర్వే) రిపోర్టులు కోరుతుండడంతో పాటు కౌంటర్ సైన్లు కూడా తప్పనిసరి అని చెబుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఇంజినీర్లు వాండ్రంకి శ్రీనివాసరావు, బాకి సురేష్, వెంకటేష్, సీహెచ్ భద్రం, బి.సత్యన్నారాయణ, బి.రమేష్, జి.శ్రీనివాసరావు, కిరణ్, రవి కుమార్, సందీప్, శశికాంత్ ఉన్నారు.


కమిషనర్ ప్రసాదరావును కలిసిన లైసెన్స్‌డు ఇంజినీర్లు

ఆకట్టుకున్న బుర్రకథ


బుర్రకథ ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాండ్రంగి వీధిలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి బుర్రకథ ప్రదర్శన జరిగింది. నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో నరసన్నపేట మండలం సంతపేటకు చెందిన శ్రీనివాస బుర్రకథ దళం వారిచే చక్కనైన కథను గానం చేశారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సభ్యులు వేదుల ప్రదీప్, పాండ్రంగి వంశీ, ఏ.శ్రీకర్, కళాకారులు రామకృష్ణ పాల్గొన్నారు.